క్లుప్తంగా

డాక్టర్ కల్యాణికి సన్మానం



గుంటూరు ఎడ్యుకేషన్: అధ్యాపకుల విజ్ఞానం, అనుభవం విద్యార్థుల ప్రగతికి మూల కారణమని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపకురాలు దాసరి కల్యాణి ఇటీవల అన్నామలై విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా సోమవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు వైష్ణవి, వేదవతి, అనిత, బాజీబాబు, అభిలాష్, రాజరాజేశ్వరి, ఎంసీ విభాగాధిపతి రాజ్యలక్ష్మి, శశికళ పాల్గొని డాక్టర్ కల్యాణికి సత్కరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు

నెహ్రూనగర్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్సీ ఎన్నికల విధులు కేటాయించబడిన నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విధులు కేటాయించబడిన నోడల్ అధికారులు పోలింగ్ స్టేషన్‌లో పారిశుద్ధ్య పనులు, అవసరమైన బ్యారికేడింగ్, తాగు నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు పాల్గొన్నారు.

26న మహా శివరాత్రి వేడుకలు ప్రత్యక్ష ప్రసారం

నగరంపాలెం: కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ నుంచి మహా శివరాత్రి వేడుకలను గుంటూరు నగరంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 సాయంత్రం 6 గంటలకు పట్టాభిపురం టీజేపీఎస్ కళాశాలలో ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమై, ఉదయం ఆరు గంటల వరకు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 99493 12299, 73372 38005 నంబర్లల్లో సంప్రదించాలని తెలిపారు.

పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

లక్ష్మీపురం: పట్టభద్రులందరూ ప్రలోభాలకు లోను కాకుండా కచ్చితంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటర్ల చైతన్య సభ సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసీ అధికారి వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఓటర్లను చైతన్య పరిచేందుకు పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలి..

గుంటూరు మెడికల్: పట్టభద్రుల ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర రామశర్మ చుండూరు కోరారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ సకాలంలో ప్రభుత్వం తీసుకువచ్చే విధంగా కార్పొరేట్ విద్యా వ్యవస్థకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాల పిల్లల అభివృద్ధి పాటు పడతానన్నారు. సమావేశంలో వెంకట రమణ మూర్తి, హర్షవర్ధన్ శాస్త్రి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి

నెహ్రూ నగర్: స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని, అందులో భాగంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి ఉత్పత్తులను ఈ-కామర్స్ ప్లాట్ ఫారంలో ఒకే రోజు లక్ష ఉత్పత్తులను అమ్మకం చేయడం ద్వారా గిన్నీస్ రికార్డ్ సాధించడానికి గుంటూరు నగరంలో ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మెప్మా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా సీఎంఎంలు, సిఓలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ వాకౌట్ సబబే

లక్ష్మీపురం: ప్రతిపక్ష హోదా కోరుతూ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం సబబేనని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు(సంగమ్) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష హోదా కోరడం మినహాయించి మిగిలిన అంశాలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి రావాలని వైఎస్సార్ సీపీని ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కక్ష్య సాధింపు వైఖరే అసలు సమస్య అని పేర్కొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర

నగరంలో కొలువుదీరిన శైవక్షేత్రాలు మహా శివరాత్రికి ముస్తాబయ్యాయి. వంద సంవత్సరాలకు పైబడిన శివాలయాలు ఆరుకి పైగా ఉన్నాయి. నగరంలోని పలు ప్రాంతాలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాల నుంచి, విజయవాడ, హైదరాబాద్ పరిసరాల్లోని భక్తులు తరలిరానున్నారు. ఆలయాల్లో వద్ద తగిన వసతులు కల్పించారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో మజ్జిగ సరఫరా చేయనున్నారు. దేవాలయాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు – నగరంపాలెం

అరండల్‌పేటలో సోమసుందర స్వామి దేవస్థానం..



గుంటూరు అరండల్‌పేట 4/4లోని శ్రీ హంపీ పీఠ పాలిత విద్యారణ్య భారతీస్వామి పరిపాలిత గంగా మీనాక్షి సమేత సోమసుందర స్వామి దేవస్థానం నెలకొంది. 1901లో గంగా మీనాక్షి సోమసుందర స్వామి వార్లను ప్రతిష్ఠించారు. ఏక రామయ్య, రత్తమ్మ దంపతులతో దేవాలయం ప్రతిష్ఠ జరిగింది. ఉప దేవాలయాలు నెలకొన్నాయి. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్లను 1938లో, నవగ్రహ ఆలయం ప్రపత్తి ఆంజనేయస్వామి దేవాలయాన్ని 1965లో ప్రతిష్ఠించారు. గురుదత్తాత్రేయ స్వామిని 1970లో, బాల సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామి ఆలయాన్ని 1998లో, మేధోదక్షిణామూర్తి దేవాలయం 2019లో ప్రతిష్ఠించారు. కుందుర్తి రామయ్య వంశీస్తులు అర్చక బాధ్యతల్లో ఉన్నారు.

బ్రాడీపేటలోని గౌరీ విశ్వేశ్వరాలయం..



పురాతన దేవాలయాల్లో బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయం ఒకటి. ఆలయాన్ని 1925 జూన్ 12న ప్రతిష్ఠించినట్లు ప్రధాన అర్చకులు జంధ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. ఈ ఏడాదికి వందేళ్లను పూర్తి చేసుకుంది. స్వాతంత్ర్య సంగ్రామ యాత్రలో భాగంగా ఆలయ ధర్మకర్తలైన ఉప్పుటూరి వెంకటపున్నయ్య, ఉప్పుటూరి నరసింహారావు ఆహ్వానం మేరకు మహాత్మాగాంధీ దేవాలయాన్ని సందర్శించారు. గాంధీజీ స్వయంగా శ్రీగౌరీవిశ్వేశ్వర ఆలయంగా నామకరణం చేశారు. 1960 దశకం నుంచి జంధ్యాల కుటుంబ సభ్యులు వంశపారంపరంగా దేవాలయ అర్చకత్వం నిర్వహిస్తున్నారు. స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర విధి రోజున ప్రతి మాసం స్వామి కల్యాణాన్ని క్రమ తప్పకుంగా నిర్వహిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో గణపతి, విశ్వేశ్వరుడు, గౌరిదేవీ, లక్ష్మీనారాయణతో పాటు నవగ్రహ మండపం, ప్రసన్నాంజనేయ స్వామి, సాయినాధుని ఉపాలయాలు ఉన్నాయి. శివరాత్రికి దేవాలయంలో ప్రత్యేక పూజలతోపాటుగా లింగోద్భవ సమయంలో విశేష పూజలు చేపడుతున్నారు.

ఆర్ అగ్రహారంలో మల్లేశ్వరస్వామి ఆలయం..



ఆర్ అగ్రహారంలో గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని పన్నాల పరదేశి సోమయాజులు 1762లో ప్రతిష్ఠించినట్లు చెబుతుంటారు. 1762 నుంచి 1952 వరకు ధర్మకర్తలు పరిపాలించారు. 1952 నుంచి దేవదాయ ధర్మదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి ఆ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ దేవస్థానానికి అనుబంధంగా విఘ్నేశ్వరాలయం, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, ఆదిశంకరాచార్య స్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, శివకామ సుందరి సమేత నటరాజ స్వామి, కోదండరామస్వామి, కాలభైరవ స్వామి, వల్లీదేవసేన సమేత కుమార స్వామి ఆలయాలు ఉన్నాయి. అదిగాక ఐదంతస్తుల గాలి గోపురం ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఈ దేవస్థానంలో ఉత్సవాలు, పూజలు వైదికాగమ శాస్త్ర ప్రకారం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఇక స్వామి బ్రహ్మోత్సవాలు వైశాఖ శుద్ధ షష్ఠి నుంచి వైభవోపేతంగా నిర్వహించనున్నారు. నవాహ్నిక దీక్షతో, విద్యుద్దీపాలంకరణతో, నవ వాహనాలపై శ్రీ స్వామి వార్ల గ్రామోత్సవాలు జరుగుతాయి.

విద్యావంతులతోనే దేశ ప్రగతి సాధ్యం



డాక్టర్ విజయకు జ్ఞాపిక బహూకరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: అందరూ విద్యావంతులు కావడం ద్వారానే దేశ ప్రగతి సాధ్యమవుతుందని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ యలమంచిలి విజయ పేర్కొన్నారు. సోమవారం పాత గుంటూరులోని హిందూ కాలేజీ హైస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ విద్య, వైద్యం రెండూ దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తాయని చెప్పారు. పాఠశాల కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తున్నాయని, అవి కార్యరూపం దాల్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని చెప్పారు. ప్రముఖ వైద్యుడు మన్నవ రాధకృష్ణమూర్తి మాట్లాడారు. సభలో విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, పాలక మండలి సభ్యుడు మాజేటి ముత్యాలు, పూర్వ విద్యార్థి సంఘ కార్యదర్శి మేడేపల్లి నరసింహ మూర్తి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్ఎం గాయత్రి పాల్గొన్నారు.

ఎక్స్‌టెన్షన్ అవుతున్న పనులు గడువు



మూడు వంతెనల వద్ద జరుగుతున్న పనులు

- 25వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పిన రైల్వే అధికారులు
- ఇంకా పూర్తి కాని పనులు
- ప్రస్తుతం డ్రైయిన్ పైపులైన్ వేస్తున్న దృశ్యం
- నేడు అప్రోచ్ రోడ్డు వేస్తామంటున్న రైల్వే అధికారులు



టన్నెల్స్‌కు రోడ్డుకు అప్రోచ్ రోడ్డు వేయాల్సిన ప్రాంతం

నెహ్రూనగర్: నగర వాసులకు ఇంకో వారం రోజుల పాటు ట్రాఫిక్ కష్టాలు తీరేలా లేవు. మూడు వంతెనల వద్ద ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులను రైల్వే అధికారులు సాగదీస్తున్నారు. రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ నిమిత్తం నవంబర్ 25వ తేదీ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు నిలిపివేసిన విషయం తెలిసిందే. 60 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకు పనులు పూర్తి చేయకపోవడంతో నగర వాసులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిపివేయడంతో నగర ప్రజలు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వేగేటు, శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా 1 టౌన్ నుంచి 2 టౌన్‌కి, 2 టౌన్ నుంచి 1 టౌన్‌కి రాకపోకలు సాగిస్తున్నారు.

ఫిబ్రవరి 25వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పి...

రైల్వే ట్రాక్ ఎక్స్ టెన్షన్ పనులు చేపడుతున్న క్రమంలో మూడు వంతెనల కింద హెచ్ఎల్ఆర్ వెళ్లే వాటర్ పైపులైన్ జంక్షన్ ఉంది. ఈ పైపును మార్చాలని రైల్వే అధికారులు నగరపాలక సంస్థ అధికారులను కోరడంతో జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సదరు పైపులైన్ జంక్షన్ మార్చారు. ఇప్పటికే రెండు నెలలకు పైబడి నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎట్టి పరిస్థితుల్లోను ఫిబ్రవరి 10వ తేదీ నాటికి పనులు పూర్తి చేసి మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించే విధంగా చూడాలని రైల్వే అధికారులను ఆదేశించారు. కాని రైల్వే అధికారులు 10వ తేదీ నాటికి పనులు పూర్తి కావని ఫిబ్రవరి 25వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. సరే అద్దైన చేశారా అంటే.. అది కూడా లేదు. ఇంకో వారం రోజుల పాటు పనులు సాగుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

అప్రోచ్ రోడ్డు వేయాలి..

మూడు వంతెనల వద్ద టన్నెల్స్ వేయడం పూర్తయింది. కాకపోతే సదరు టన్నెల్స్‌కు రోడ్డుకు అప్రోచ్ రోడ్డు వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం డ్రెయినేజీ పైపులు వేస్తున్నారు. ఇది అయిపోయిన వెంటనే అప్రోచ్ రోడ్డు వేయడం జరుగుతుందని డీఆర్ఎం కార్యాలయ అధికారులు చెబుతున్నారు. రోడ్డు వేసిన వెంటనే వాటర్ క్యూరింగ్ చేయాలని కాబట్టి రాకపోకలు సాధ్యం కాదాని, దీని వలన మరో వారం రోజుల పాటు మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగవని రైల్వే అధికారులు చెబుతున్నారు.

గంటల తరబడి రైల్వే గేటుల వద్ద అవస్థలు

మూడు వంతెనల వద్ద రైల్వే ఎక్స్‌టెన్షన్ పనుల కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటుల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయింది. ఉదయం పూట స్కూల్, కాలేజీలకు, ఉద్యోగాలకు వెళ్లే వారు రైల్వే గేటుల వద్ద గంటల తరబడి ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోవాల్సి వస్తుంది. ఒక్కో సారి రెండు మూడు రైళ్లు వెళ్లే దాకా కూడా రైల్వే గేటులు తీయకపోవడంతో వందల మీటర్ల కొలది ట్రాఫిక్ జాం పెరిగిపోతుంది. ఇప్పటికైన రైల్వే అధికారులు మూడు వంతెనల వద్ద పనులు వేగవంతం చేసి నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

శివలింగాకృతి ప్రతిమల పంపిణీ



గుంటూరు రూరల్: అమరావతి సమీపంలో తాళ్లాయపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శివక్షేత్రానికి జొన్నలగడ్డ గ్రామంనుంచి శివలింగాకృతి ప్రతిమను పంపిణీ చేశారు. సోమవారం శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో శివలింగాకృతి ప్రతిమను భారీ ఊరేగింపుగా పంపిణీ చేశామన్నారు. నూతనంగా తాళ్లాయపాలెంలో నిర్మించే శివక్షేత్రానికి అనేక ప్రాంతాల నుంచి 6 లక్షల 20 వేల శివలింగాకృతి ప్రతిమలను పంపిణీ చేయటం జరిగిందన్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం



గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని అటువంటి వాటిని నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని క్రాప్ సంస్థ ప్రతినిధి పద్మజ తెలిపారు. సోమవారం పెద్దపలకలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల వ్యతిరేక కళాజాతాను నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలి

కాకుమాను: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శంకర్ బాబు అన్నారు. పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ జి.లక్ష్మీదేవి, డెప్యూటీ తహసీల్దార్ కరిముల్లా పాల్గొన్నారు.

క్రీడాకారులుగా రాణించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో ఇష్టమైన క్రీడాంశాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి, కళాశాల స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులుగా రాణించాలని టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి పేర్కొన్నారు. సోమవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు కళాశాల స్థాయిలో స్పోర్ట్స్, గేమ్స్ పోటీలను నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కన్వీనర్స్ డాక్టర్ యు.రవికుమార్, డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ, మేజర్ పి.కుమార్ రాజా, డాక్టర్ డీవీ చంద్ర శేఖర్, డాక్టర్ వీవీహెచ్‌కే శాస్త్రి, సీహెచ్. విజయలక్ష్మి, వైసీహెచ్ మణి, వరలక్ష్మి, డాక్టర్ ఆర్.శిరీష, కె. సునీత, వై.అమూల్య, సల్మా సుల్తానా, యన్. సంగీత, హెప్సీబా, సీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఉండవల్లి పంప్‌హౌస్‌ని పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో రానున్న వేసవిలో తాగునీటి సరఫరాలో ఏ సమస్య రాకుండా ఇంజినీరింగ్ అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఉండవల్లి పంపింగ్ హౌస్‌ని పరిశీలించారు. తొలుత ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నీటి నిల్వ, ఉండవల్లి పంపింగ్ కేంద్రం నుంచి ప్రతి రోజు ఎంత నీరు గుంటూరు నగరపాలక సంస్థకు డ్రా చేస్తుంది, మోటార్ల కెపాసిటి, పనితీరు తదితర అంశాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉండవల్లి పంప్ హౌస్, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాస్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు నారాయణ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు బకాయిలు చెల్లించాలి

నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజు బకాయిలను మార్చి 15వ తేదీ లోగా ఏజెన్సీలు చెల్లించాలని, లేని పక్షంలో సదరు హోర్డింగ్‌లను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం మీడియా ఏజెన్సీలు, పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ చాంబర్‌లో బకాయిల వసూళ్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు రెహమాన్ పాల్గొన్నారు.

శివారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సింహాద్రి శివారెడ్డి చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు

లక్ష్మీపురం: అమరజీవి సింహాద్రి శివారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సింహాద్రి శివారెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ శివారెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. పార్టీని మితవాద, అతివాద, విచ్చిన్న శక్తుల వైపు కొట్టుకుపోకుండా నిలబెట్టారని చెప్పారు. రైతు నాయకుడిగా రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు కొనియాడారు. భూమి లేని పేదలకు భూమి కావాలని ఉద్యమాలు నిర్వహించారని చెప్పారు. తన కుటుంబాన్ని పార్టీ వైపు నిలబెట్టారని, తన జీవిత చరమాంక వరకు పార్టీ ఎదుగుదలకు కృషి చేశారన్నారు. వారి స్ఫూర్తితో ప్రజలెదుర్కొనే సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పార్టీని నిలబెట్టడంలో కీలకంగా పనిచేశారన్నారు. కార్యకర్తల గుర్తించడంలో, వారిని తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషించేవారన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రభాకర్‌రెడ్డి, వై.కేశవరావు, ఎం.సూర్యరావు, కె.నళీనికాంత్, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర పిలుపుమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పున ప్రారంభిస్తామని ప్రకటించటంతో పాటు పెండింగ్ లో ఉన్న 46వేల క్లైములకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికలలో గెలిచి అధికారం చేపట్టి 9 నెలలు నిండినప్పటికీ ఇంతవరకు సంక్షేమ బోర్డు ప్రకటించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు కాయల రామారావు, వీరాంజనేయులు, రాజు, శ్రీను, ఆర్ మోజేష్ బాబు, రెంటాల కుమారి, సిహెచ్ విజయలక్ష్మి, సుశీల, సుగుణ నాంచారమ్మ పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి 264 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారిలో 54 మంది అంతర్జాతీయస్థాయిలో ఆడిన క్రీడాకారులు పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన క్రీడాకారిణి చిన్నం వైష్ణవి ఏడు రౌండ్లు గెలిచి విజేతగా నిలువగా, కె.రవికుమార్ 6.5 పాయింట్లతో ద్వితీయ స్థానం, పల్నాడు జిల్లాకు చెందిన ఎ.వెంకట సాయికృష్ణ తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆనంద్ చెస్ అకాడమీ ఫౌండర్ ఎం.సాంబశివరావు, టోర్నమెంట్ న్యాయనిర్ణేత ఎం.గోపీనాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య, ఏవో కె. వెంకట్రావు బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో రుత్వికులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు 11 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివ లింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు చేపట్టారు. పలు రకాల హోమ ద్రవ్యాలతో హోమ పూర్ణాహుతి జరిగింది. అన్నమయ్య కళావేదికపై ప్రముఖ సాహితీవేత్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి మహాభారతంలోని అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పెదకాకాని: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాలు.. పెదకాకాని రైల్వే హాల్ట్ సమీపంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లు సోమవారం స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తెలుపు రంగు బన్నీ, నీలి గడుల లుంగీ ధరించి ఉన్నాడు. సుమారు 60 సంవత్సరాలు కలిగిన ఆ మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ జి.అంజిబాబు తెలిపారు.